# సమ్మరోపాఖ్యానం

ఏవండీ అంకా కులసా?"

"ఆ ఏం కులాసా లెద్దురు"

"అదేవిటి అట్లా అంటున్నారు?'

"ఎండలండీ ఎండలు-"

"నిమ్మకాయ షర్బత్తులు తాగండి."

"ఆ ఏం నిమ్మకాయ పోనిస్తురూ—"

"షోడాల్తాగండి"

"ఆ ఏవిషోడాలు? అవీ వెచ్చగా వుంటాయ్"

"పోనీ కూల్డ్రింక్సులు తాగండి"

"కూల్డ్రింక్సులు మాత్రం తాగినంత సేపే నోరు చల్లబడేది— మళ్ళీ గొంతుకెండిపోవడమే."

"పోనీ మంచినీళ్ళు త్రాగండి."

"ఏం మంచినీళ్ళు. కూజాలోవి కూడా చల్లగా వుండటం లేదు."

"పోనీ కుండ కొనండి కుండ–కుండ."

"కుండలూ కూజాలూ కాపాడవండీ-ఎండలు-ఎండలు—"

"మజ్జిగ యింత ఉప్పేసుకుని త్రాగేస్తే...."

"ఎన్నిమాట్లు త్రాగమంటారు?"

"పోనీ చిట్టుడుకు నీళ్ళుతీసి గరిటెడు మజ్జిగ ఉప్పు నిమ్మకాయ రసం పిండుకుని తాగితేనో."

"లాభం లేదండీ-హ్లావీ లాభం లేదు."

"పళ్ళరసం-పోనీ రోజూ మధ్యాహ్నం రెండు బత్తాయిపళ్ళు పిండుకుని అందులో చక్కెర మిళాయించి పుచ్చుకోండి-"

"బత్తాయి పళ్ళా? రెండా-ఈ ఎండల్లో మీరేదో వేళాకోళం ఆడుతున్నారు."

"బంగినపల్లి మామిడిపళ్ళు నైసుగా చెక్కుతీసి లప్లీగా ముక్కలు తరిగి ఐసులో పెట్టి చెంచాతో ఒక్కొక్కటే తింటూ వుంటే – అదేమిటి అలా తెల్ల మొహం వేస్తున్నారు?"

"ఐసుకోసం మామిడిపళ్ళ కోసం బజారుకెళ్ళేసరికి మొహం తిరిగి పడిపోరటండీ—ఎండలు-ఎండలు-హ్లావీ లాభంలేదు-"

"మరేం చేస్తారు?"

"హ్లావీ చెయ్యలేం. సూర్య నమస్కారాలు తప్ప–"

"గాభరాపడకండి-ఎండలకే గాభరాపడితే ఎల్లాగండి? రోహిణీకార్తె మరోటా?"

"రోహిణీకార్తె?"

"రోళ్ళు పగలవుటండీ?"

"పగుల్తాయ్–పగుల్తాయ్."

"తొట్టిలో నీళ్ళు నింపి-నీళ్ళతొట్టి—నీళ్ళతొట్టి—నీళ్ళతొట్టి."

"అవును వినపడ్తోంది"

"అందులో కూర్చోండ నా మాట విని"

"బయటకు రాగానే వడగొట్టి పడిపోమూ?"

"నీళ్ళ తొట్టిలో వుండగా పడిపోయినా ఫరవాలేదు—"

"హ్హైవీ లాభంలేదు-ఎంత సేపు కూర్చుంటాం అందులో?"

"అడ్జస్టు కావాలి మరి వాతావరణానికి."

"కావ్యాల్లో విరహతాపం అంటూ వుంటారు.అది ఈ బెజవాడెండల కంటె ఎక్కువా?"

"అయివుండదు. విరహతాపం ఏపాటిదయినా బెజవాడ ఎండల కంటే తక్కువే అయుంటుంది."

"విప్లవ కవిత్వం మాచెడ్డ హాట్‌గా వుంటుందంటారు. అదో?"



"అదికూడా బెజవాడ ఎండల ముందు తక్కువే-"

"రాష్ట్ర రాజకీయాలు హాట్‌గా వుంటాయంటారు-"

"అవీ బెజవాడ ఎండకు దిగదుడుపే-"

"పోనీ ఓ పనిచేయండి."

"ఏవిటది?"

"మంచి ప్రేమకథలు చదువుతూ తడిబట్ట కట్టుకు కూర్చోండి."

"ప్రేమ కథలు చల్లగా వుంటాయా?

"వుండకపోతే పుస్తకాన్ని నీళ్ళలో ముంచి పైకితీసి చదవండి చల్లగా వుంటుంది."

"నాన్సెన్స్."

"మరి ఈ ఎండల్లో పెళ్ళిళ్లు చేసుకునే వాళ్ళు—"

"వాళ్ళ ఖర్మం అడక్కండి - జావ జావ అయిపోతారు, ఉత్తర దక్షిణ ధృవాల్లా వుండాల్సిందే—"

"వర్షాలొస్తాయనుకుంటాను."

"ఎలా అనుకుంటారు?"

"రాకపోతే చచ్చిపోముటండీ?"

"కళ్లు మూసుకుని వర్షం వచ్చినట్లు వూహించుకుంటే చల్లగా వుంటుంది. గొడుగు పట్టుకు నడుస్తున్నట్లు-బురద మీ మీదకి చిమ్ముతూ కారు వెళ్ళినట్లూ. తడసిపోయి రోడ్డుమీద పరుగెత్తుతున్నట్లూ — ఎక్కడ చూసినా నీళ్ళు నీళ్ల నీళ్ల—చల్లగా గాలి—అబ్బ."

"వర్షాకాలంలో అబ్బ ఎండ వస్తుందా బాబూ-ఎండవస్తే బావుణ్ను అనిపిస్తుందా-వర్షాకాలంలో వేడి వేడి పకోడీలు తినాలనీ. గరం గరం చాయ్ గరంగరంగా తాగాలనీ. హాట్ హాట్‌గా వుండాలని అనిపిస్తుందా లేదా?"

"అనిపిస్తే—"

"వుండు, పేద వెధవకి ఎయిర్‌కండిషన్ గదులూ, సోఫాలూ, ఫానులూ, కేకులూ, కూల్‌డ్రింకులూ, కారుల్లో మెత్తని సుఖాలూ, డన్‌లపు పరుపులూ. రూపాయీ నోట్లకట్ల లూ జ్ఞాపకం వచ్చి సుఖాన్ని కలిగిస్తాయి. వూహల్లో - వున్నవాడి సుఖం అంతా లేనివాడు దాన్ని గురించి వూహించు కొనే పరిస్థితుల్లో వాడ్ని వుంచడంలోనే వుంది. అలాగే సమ్మరూ వింటరూ వగైరాలు—?"

"ఒప్పుగున్నాం—కంటిన్యూ—?"

"నన్నడిగితే ఎండల్లో వర్షాకాలం గురించి వూహించుకోవాలి అలాగే వైస్‌వెర్సా—శీతాకాలంతో వసంతకాలం గురించి వూహించుకోవాలి—"

"ఆల్‌రైట్ ప్రొఫెసీడు."

"ఋతువుల మీద ఆగ్రహం కలగకుండా మంచి అభిప్రాయం కలగాలంటే మనం వుంటున్న ఋతువుని వదిలేసి మిగతా ఋతువుల గురించి ఆలోచించాలి."

"సరే—ఇదో ఎస్కేపిజం"

"బాబోయ్ ఎండలు అని సూర్యుడిన్ని తిట్టుకుంటూ ఏడుస్తూ ఎందుకుండటం—కనుక వింటర్ని పొగుడుతూ పజ్యాలు రాయి. వర్షాన్ని ఆహ్వానిస్తూ కందపద్యాలు రాసి—"

"వున్నదాన్నొదిలేసి లేనిదాన్ని పట్టుకో మంటావు."

"అంటంలేదు. ఏడవొద్దు అంటున్నాను."

"ఈ ఎండలు యీ మంటలు యీ దాహం ఈ చిరాకు ఈతాపం నుంచి రక్షించమంటున్నాను."

"ఇవిలేవు అనుకోవటమే దీని నుంచి రక్షణ."

"షటప్"

"షటప్ కాదు. 1982లో 128 డిగ్రీల వేడి వుంటుందనుకో-ఇప్పుడు 1972లో 115 డిగ్రీలో 118 డిగ్రీలో వుంది గనుక అప్పుడు నేను వుండను కదా అని ఆ ప్రభువుకి మోకాళ్ళమీద అని కృతజ్ఞతలు చెప్పుకోవాలి."

"1990లో అగ్గిపెట్టె రూపాయి వుంటుంది. కాబట్టి 1972లో సుఖంగా వున్నామని నమ్మమంటావు."

"అంతే—అంతే-"

"ఏవండీ కులాసా?"

"ఆహా అంతా కులాసా?"

"ఎండలెలా వున్నాయ్!"

"మామూలే"

"జాగ్రత్తగా వుండండి"

"హా ఏం జాగ్రత్తా—?"

"వీధిలో తిరక్కండి. ఇంట్లో వుండండి."

"ఇంట్లో వున్నవాళ్ళు మటుకు పోటంలా-"

"ఆసంగతి కాదు నేన్చెప్పేది?"

".... .... .... ...."

"మాట్లాడరేం?"

.... .... .... ...."

"ఎండదెబ్బ కొట్టిందా!"

.... .... .... —"